
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 4 సెప్టెంబరు 2024 | 5





కోకో పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

తెల్ల దోమ నివారణకు బదనికల తయారీ

కలెక్టర్‌కు వివరించిన ఉద్యాన పరిశోధనా కేంద్రం అధిపతి చలపతిరావు

అంబాజీపేట, సెప్టెంబరు 3: అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న పరిశోధనలు, కొబ్బరిలో రకాలు, పురుగులు, తెగుళ్ల వంటి వాటిని పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు కలెక్టర్‌కు వివరించారు. కొబ్బరిని ఆశించిన తెల్లదోమ నివారణకు బదనికలను తయారుచేసి రైతులకు అందిస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. రైతులు బదనికలను కొబ్బరి తోటల్లో సామూహికంగా వినియోగిస్తే తెల్ల దోమ ఉధృతి తగ్గుముఖం పడుతుందన్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో తెల్ల దోమపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. పరిశోధనా కేంద్రం నుంచి విడుదల చేసిన గోదావరి గంగ హైబ్రీడ్ రకానికి డిమాండ్ అధికంగా ఉందని... సాలుకు 25వేల కొబ్బరి మొక్కలను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ఈ మొక్కల కోసం కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారుల నుంచి అధికంగా సిఫార్సు లేఖలు వస్తున్నాయన్నారు. దీంతో అడిగిన రైతులకు పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నామన్నారు. కొబ్బరిలో అంతర పంటగా సాగు చేస్తున్న కోకో మొక్కలకు డిమాండ్ ఎంతమేర ఉందో శాస్త్రవేత్తలు, స్థానిక రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో ధరల విషయంపై ఆయన ఆరా తీశారు. నల్లముట్టి పురుగు, తెల్లదోమ, ఆకుతేలు నివారణకు ఉపయోగించే బదనికలను ఉత్పత్తి చేసే పద్ధతులను శాస్త్రవేత్తలు కలెక్టర్‌కు వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ గోవర్ధనరావు, డాక్టర్ వి.అనూష, డాక్టర్ ఎ.కిరీటి, బి.నీరజ, తహసీల్దారు జె.వెంకటేశ్వరి, ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, ఉద్యానవన శాఖాధికారి శైలజ, కృషీవల ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, సీఈవో అడ్డాల గోపాలకృష్ణ, అభ్యుదయ రైతు చిట్టావఝుల బాబూరావు, పరిశోధనా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



బదనికలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల వివరాలు సమర్పించాలి

మత్స్య శాఖ సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 3: జిల్లాలోని ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల వివరాలు సమర్పించాలని ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవా



రం ఆయన మత్స్య శాఖపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని నదులు, కాల్వలు, సముద్రంపై ఎంతమంది మత్స్యకారులు చేపల వేటపై జీవనం సాగిస్తున్నారో సమాచారం ఇవ్వాలన్నారు. సముద్రం లోపల చేపల వేటకు వెళ్లేటప్పుడు బాహ్య ప్రపంచంతో ఎలా కమ్యూనికేట్ అవుతున్నారో ఆరా తీశారు. భైరవపాలెం, బలుసుతిప్ప, కొత్తపాలెం, ఓడలరేవు, వాసాలతిప్ప, అంతర్వేది, కరవాకల్లోని ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో జెట్టీలు, వేలంపాట హాలు, వలలు మరమ్మతులు చేసుకునే హాలులు, చేపల స్టోరేజీ గదులు వంటి మౌలిక సదుపాయాలపై కేంద్రాల వారీగా ఆరా తీశారు. ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల నుంచి చేపలను ఏ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారో వివరాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 36వేల ఎకరాలు ఆక్వా కల్చర్ కింద సాగవుతోందని, దీనిలో 28వేల ఎకరాలు ఆక్వా జోన్‌లో ఉన్నట్టు జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాస్ వివరించారు.

అమలాపురంలో క్షుద్ర పూజల కలకలం!

- వివరాలు 7లో

ముంపు ముప్పు



గొరగనమూడి, కూనవరం డ్రెయిన్ల ఆయకట్టు పరిధిలోని భీమనపల్లి గ్రామంలో నీట మునిగిన వరి నాట్లు



వానపల్లిపాలెంలో సార్వా చేలల్లో కలువలు పెరిగిన దృశ్యం

ఉప్పలగుప్తం మండలంలో వ్యవసాయం కత్తి మీద సాము. కాదు కాదు కూనవరం డ్రెయిన్ ప్రవాహంలో ఎదురీత. ముంపుతో అలుపెరుగని యుద్ధం. ప్రతి సీజన్లోనూ సాగుకు ఆరాటం. అనంతరం పంటను రక్షించుకునేందుకు అనుక్షణం పోరాటం. ఇదీ మండల రైతుల దీనస్థితి.

- కూనవరం డ్రెయిన్ కోరల్లో ఉప్పలగుప్తం
- ఐదు మండలాల మురుగును భరిస్తున్న పొలాలు
- ఎక్కడ వానొచ్చినా ఉప్పలగుప్తానికే ముంపు
- ఏటా వేల ఎకరాల విస్తీర్ణంలో సాగుకు స్వస్తి

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 3: కూనవరం మేజర్ డ్రెయిన్ ఆయకట్టు పరిధిలో ఏ మండలంలో వానొచ్చినా, వరదొచ్చినా ముంపు ముప్పు మాత్రం ఉప్పలగుప్తం మండలానికే. కూనవరం డ్రెయిన్‌లోకి ఐదు మండలాల పొలాల మురుగునీరు దిగుతుంది. ఈ డ్రెయిన్ ఉప్పలగుప్తం మండలంలో తన ప్రయాణం ముగించుకుని సముద్రంలో కలుస్తుంది. ఫలితంగా మండలంలోని నూరు శాతం పంట పొలాలు ఈ డ్రెయిన్ కన్నెర్రకు గురవుతాయి. పై మండలాల్లో ఎక్కడ ముంపు ఏర్పడినా ఆ నీరంతా ఈ డ్రెయిన్ ద్వారా బయటకు పోవాల్సిందే. ఎగువ నుంచి ముంపు



గొరగనమూడి డ్రెయిన్ ఆయకట్టు పరిధిలో కలువల కాసారాలుగా మారిన సార్వా పొలాలు

ప్రవాహానికి డ్రెయిన్ గట్టు బలహీనపడి పరిసర గ్రామాలను ముంచేయడం అందరికీ తెలిసిందే. గత దశాబ్దంగా ఉప్పలగుప్తం మండలంలోని 70శాతం విస్తీర్ణంలో పొలాలు వర్షాకాలంలో జలాశయాలుగా, కలువల చెరువుల్లా దర్శనమిస్తుంటాయి. 25శాతం విస్తీర్ణంలో దాళ్వా సాగును సైతం విరమించుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మండు వేసవిలో సైతం పొలాల్లో నీరు ప్రవహించడం ఉప్పలగుప్తం మండలానికి మాత్రమే ప్రత్యేకం. ఈ ఏడాది కూనవరం పూర్తిస్థాయిలో పడగ విప్పింది. నాట్లేసిన పొలాలు చెరువుల్లా మారాయి. కూనవరం మొగ తవ్వినా ఫలితం లేకపోయింది. మండలానికి ముంపు ముప్పు తప్పాలంటే కూనవరం డ్రెయిన్ గట్లను పటిష్టం చెయ్యాలి. ఎప్పటికప్పుడు మురుగునీరు సముద్రంలోకి పోయేలా సాంకేతికంగా ఏర్పాట్లు చెయ్యాలి. తక్షణ చర్యలు తీసుకోకపోతే మిగిలిన 30శాతం పొలాలు కూడా జలాశయాలుగా మారడం ఖాయమని రైతులు చెప్తున్నారు.

వర్షాలు, వరదల ఎఫెక్ట్

- పెరగనున్న కూరగాయల ధరలు
- సెంచరీ దాటనున్న ఉల్లి
- మిగిలిన రకాలదీ అదే బాట
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా ఆకు, కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాంతో రానున్న రోజుల్లో వాటి ధరలు ఆకాశాన్నంటే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ముందెన్నడూ లేని రీతిలో ఉభయ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు ఈ పంటలు పండే ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా వరదలకు అపార నష్టం వాటిల్లింది. దీనికి తోడు గతంలో సంభవించిన గోదావరి వరదల కారణంగా ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని లంక గ్రామాల్లో ఉద్యానవన పంటలన్నీ దెబ్బతిన్నాయి. ఫలితంగా ఇప్పటికే కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. రానున్న రోజుల్లో ఉల్లిపాయలతో పాటు వివిధ జిల్లాల నుంచి సరఫరా అయ్యే ఆకు, కూరగాయల ధరలు రికార్డు స్థాయికి చేరే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వర్షాలతో మార్కెట్‌లో ధరలను పెంచేశారు. నాణ్యతను బట్టి ఉల్లిపాయలు కిలో రూ.70 నుంచి రూ.80 వరకు పలుకుతున్నాయి. ఈ ధర సెంచరీ దాటే అవకాశం ఉందని చెప్తున్నారు. ఉల్లి ఉత్పత్తి అయ్యే ప్రాంతాల్లో పంటలు పూర్తిగా దెబ్బతినడం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నం కానుందని సమాచారం. ఇప్పటికే ఉల్లిపాయల ధరలను పెంచి విక్రయించడంతో పాటు కొందరు నిల్వలు కూడా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక అల్లం ధర వంద పైనే ఉంది. వంకాయలు, బెండకాయలు, బీరకాయలు వంటి ధరలు ప్రస్తుతం రూ.80 వరకు ఉన్నాయి. వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రెండు రాష్ట్రాల్లోనూ గోదావరి నదీ పరివాహక లంక గ్రామాలపై వరద ప్రభావం తీవ్రంగా పడడంతోనే ఈ పరిస్థితికి కారణమైంది. ఎప్పుడూ లేని విధంగా ప్రకాశం బ్యారేజీకి వరదనీరు పోటెత్తడంతో పాటు సమీపంలో ఉన్న వేల ఎకరాల కూరగాయలు పండించే భూములన్నీ జలదిగ్బంధానికి గురవ్వడంతో రైతులు వేసిన పంటలన్నీ నాశనమయ్యాయి. ఫలితంగా రానున్న మూడు నెలల్లో ఉల్లిపాయలతో పాటు కాయగూరల ధరలు రికార్డు స్థాయిలో పెరిగే అవకాశం కచ్చితంగా ఉందని రిటైల్ వ్యాపారస్తులు చెప్తున్నారు.

ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు (రూపాయల్లో)

ఉల్లిపాయలు	70	ఆనబకాయ	40
పచ్చిమిర్చి	50	చిక్కుడు	120
అల్లం	100	ఆకాకరకాయ	200
బీరకాయలు	80	బీట్‌రూట్	50
టమాట	40	క్యాప్సికం	100
వంకాయలు	80	కాకరకాయ	40
బంగాళాదుంపలు	40	నిమ్మకాయలు	80
బెండకాయలు	60	మునగ	70
దొండకాయలు	40	కొత్తిమీర	50
క్యాబేజీ	40	తోటకూర	20

పెరుగుతున్న వరద



ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దు ప్రాంతమైన చాకలిపాలెం-కనకాయలంక కాజ్‌వే నీట మునిగిన దృశ్యం

- వర్షాలు తగ్గుముఖం పట్టినా వీడని భయం
- భయం గుప్పిట్లో లంక గ్రామాల ప్రజలు

అమలాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద మళ్లీ ముంచుకొస్తోంది. గత కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ రాగల కొన్ని రోజుల్లో వరద పెరిగే అవకాశాలున్నాయని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం కొన్ని కాజ్‌వేలపైకి వరద నీరు చేరింది. దాంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలకు కొన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయి. గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో భారీ వర్షాలు కురిసినప్పటికీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వర్షాల ప్రభావం తక్కువగానే ఉంది. దాంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే మళ్లీ వరదలు ముంచుకొస్తున్నాయన్న జలవనరుల శాఖ అధికారుల హెచ్చరికలు కోనసీమ జిల్లాలోని నదీ పరివాహక గ్రామాల ప్రజలను కలవరపరుస్తున్నాయి. ముఖ్యంగా గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధ గౌతమి నదీపాయల వెంబడి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీని కారణంగా డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. డ్రెయిన్లలో ముంపు నీరు నేరుగా గోదావరిలో కలిసే పరిస్థితులు లేకపోవడంతో పాటు గోదావరి నీరు వెనక్కి తన్ని పెట్టడం వల్ల ముంపు బెడద తీవ్రమైంది. ఫలితంగా సమీపంలో ఉన్న పంట చేలు, రొయ్యల చెరువులు మునకకు గురవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద 46 అడుగులకు చేరిన వరద నీటిమట్టం స్వల్పంగా తగ్గి రాగల 24 గంటల్లో మళ్లీ పెరిగే అవకాశం ఉందని అంచనా. ఎందుకంటే గోదావరి నదీ పరివాహక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవడం, రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడం వంటి పరిస్థితుల కారణంగా వరద ఉధృతి పెరగడం అనివార్యమని భావిస్తున్నారు. ఇప్పటికే లంక గ్రామాలను వరద తాకుతోంది. దాంతో లంక గ్రామాల ప్రజలు మళ్లీ వరద వస్తే ఈసారి తీవ్రస్థాయిలో ఉంటుందని వారి అంచనాలను చెప్తున్నారు. దాంతో స్థానికుల్లో భయాందోళనలు పెరిగాయి.



రాజులపాలెంలో వరి దుబ్బులను పరిశీలిస్తున్న బోసుబాబు

22,440 ఎకరాలకు ఈకేవైసీ నమోదు

- ఈ నెల 15వ తేదీలోపు పూర్తికి చర్యలు
- రైతులు సహకరించాలి
- వర్షాలకు 803 ఎకరాల్లో నీట మునిగిన వరి
- 59,889 మంది కౌలు రైతులకు కార్డులు జారీ
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసుబాబు

పి.గన్నవరం, సెప్టెంబరు 3: కోనసీమ జిల్లావ్యాప్తంగా వివిధ పంటలకు సంబంధించి వ్యవసాయ భూములు 2,64,453 ఎకరాలకు ఇప్పటివరకు 2,08,356 (79 శాతం) ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తయిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బోసుబాబు తెలిపారు. ఈ-పంట అనంతరం 22,440 ఎకరాలకు ఈ-కేవైసీ పూర్తయిందన్నారు. మండలంలోని పోతవరం, రాజుపాలెం గ్రామాల్లో వరి పొల్లాలను, ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఈనెల 15వ తేదీ నాటికి ఈ-కేవైసీ పూర్తి చేయాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖల సిబ్బందికి సూచించామన్నారు. 19 నుంచి 24వ తేదీ వరకు గ్రామాల్లో రైతుల జాబితాను ప్రదర్శిస్తామని, వాటిలో తప్పులు ఉంటే సరిచేసుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి తుది జాబితాను సిద్ధం చేసి గ్రామాల్లో ప్రదర్శిస్తామన్నారు. ఇప్పటివరకు ఈ-కేవైసీ పూర్తికాని రైతులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. అలసత్వం వహిస్తే ధాన్యం కొనుగోలు దగ్గర నుంచి విపత్తుల సమయంలో ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం, బీమా సౌకర్యం, రాయితీలు, సంక్షేమ పథకాలు కోల్పోతారని ఆయన హెచ్చరించారు.

జిల్లావ్యాప్తంగా డీలర్లు, సొసైటీల వద్ద 28,130 టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచామని బోసుబాబు తెలిపారు. వాటిలో యూరియా 7,700 టన్నులు, డీఏపీ 951 టన్నులు, పొటాష్ 1,100 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 17,100 టన్నులు, ఎస్ఎస్‌పీ 1,180 టన్నులు ఉన్నాయన్నారు.

జిల్లాలో ఈ సీజన్లో 77వేల మంది కౌలు రైతు కార్డులు లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని బోసుబాబు తెలిపారు. ఇప్పటివరకు 59,889 కార్డులను రైతులు పొందారన్నారు. మిగిలిన వారు కూడా కార్డులు పొందాలని, లేకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలతో పాటు సంక్షేమ పథకాలు కోల్పోతారని స్పష్టం చేశారు.

గత నాలుగు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు మామిడికుదురు, రాజోలు, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ఐ.పోలవరం తదితర మండలాల్లో 803 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని బోసుబాబు వివరించారు. నీరు ఎక్కువగా ఉన్న చేలల్లో ముందుగా నీటిని బయటకు పంపి గాలి, వెలుతురు తగిలేలా చూడాలన్నారు. అనంతరం ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ చల్లాలని రైతులకు సూచించారు. మళ్లీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటిస్తున్నారని... రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పర్యటనలో ఏడీ ఎస్‌జేవీ రామమోహనరావు, ఏవో కళ్యాణ్‌సూర్యకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పోతవరంలో ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న బోసుబాబు

వరద సహాయ చర్యల కోసం...



నగరం నుంచి వెళ్తున్న బృందం

- విజయవాడ తరలివెళ్లిన పారిశుధ్య కార్మికులు, ఇతర సిబ్బంది
- జిల్లా నుంచి అరవైకు పైగా ప్రత్యేక బృందాల తరలింపు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 3: విజయవాడ నగరాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా వరద ముంచెత్తడంతో సహాయక చర్యల కోసం జిల్లా నుంచి మంగళవారం ఉదయం ప్రత్యేక బృందాలు బయల్దేరాయి. సుమారు ఆరవైకి పైగా బృందాలు ప్రత్యేక వాహనాల్లో సాయంత్రం విజయవాడ చేరుకున్నాయి.

- వరద రక్షణ చర్యలతో పాటు ముంపు తగ్గిన వెంటనే తక్షణ పారిశుధ్య చర్యలు చేపట్టడానికి జిల్లాలోని పంచాయతీల పరిధిలోని పారిశుధ్య కార్మికులతో పాటు అమలాపురం, మండపేట, రామచంద్రపురం పురపాలక సంఘాలు, ముమ్మిడివరం నగర పంచాయతీ కార్మికులు తరలివెళ్లారు.
- వరద ముంపు ఇళ్లల్లోకి చేరుకోవడంతో విద్యుత్ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు రహదారుల వెంబడి విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ఎలక్ట్రీషియన్లు, రక్షిత మంచినీటి వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు ప్లంబర్లు వెళ్లారు.
- ఒక్కో బృందంలో ముగ్గురు స్వీపర్లు, ఒక ప్లంబర్, ఎలక్ట్రీషియన్‌తో పాటు వారిని పర్యవేక్షించేందుకు టీమ్ లీడర్లను నియమించారు.
- పారిశుధ్య చర్యల పర్యవేక్షణకు పంచాయతీ కార్యదర్శులను, మున్సిపల్ మేస్త్రీలు, శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులను ప్రత్యేకంగా నియమించారు.
- అంతే కాకుండా విజయవాడ కార్పొరేషన్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో జిల్లా నుంచి ప్రత్యేక వాహనాల్లో బ్లీచింగ్, ముగ్గు బస్తాలు, దోమల నివారణకు మలాథియాన్, ఆయిల్ బాల్స్, క్లోరిన్ లిక్విడ్, సోడియంక్లోరైడ్, లైమ్, ఫినాయిల్ తరలించారు.
- తక్షణ సహాయక చర్యల కోసం బుష్ కట్టర్లు, హైప్రెజర్ క్లీనింగ్ మిషన్లు, రోప్‌లు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ టూల్ కిట్లను తరలించారు.
- అమలాపురం పురపాలక సంఘం నుంచి 32 మంది పారిశుధ్య కార్మికులతో పాటు మేస్త్రీలు, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు ఎనిమిది మంది వెళ్లారు. పంచాయతీల నుంచి 120 మంది సిబ్బందిని తరలించారు.



అమలాపురం పురపాలక సంఘం నుంచి విజయవాడ బయలుదేరిన పారిశుధ్య కార్మికులు

జిల్లా నుంచి ప్రత్యేక బృందాలు

పి.బొజ్జిరాజు, డీఎల్‌పీవో, అమలాపురం



పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు అమలాపురం, రామచంద్రపురం నుంచి 20 ప్రత్యేక బృందాలను తరలించాం. ఒక్కో బృందంలోను ఆరుగురు సభ్యులు ఉంటారు. మలికిపురం, సఖినేటిపల్లి, అమలాపురం, ఐ.పోలవరం మండలాల నుంచి ఒక్కో బృందం చొప్పున, మామిడికుదురు, అల్లవరం, పి.గన్నవరం మండలాల నుంచి రెండు బృందాలను తరలించాం. మూడు రోజుల పాటు ఈ బృందాలు అక్కడ సహాయక చర్యల్లో పాల్గొంటాయి. అవసరమైతే మరికొన్ని రోజులు అక్కడే ఉండి సహాయ చర్యలు చేపడతాయి.



పచ్చని కొండలపై పాల నురగలా

మెట్టలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తూర్పు కనుమల్లో ప్రకృతి సోయగాలకు కొదవ లేదు. ఊటీని తలపించే అందాలు కట్టిపడేస్తున్నాయి. తుని రూరల్ ఎర్రకోనేరు వద్ద పచ్చని కొండలపై పాల నురగలా తేలియాడతూ మంచు సోయగాలు మురిపిస్తున్నాయి. కొత్త అందాలు సంతరించుకున్న ఈ ప్రాంతం ప్రకృతి ప్రేమికులను పరవశింప చేస్తోంది. - తుని రూరల్

సత్యదేవుడి హుండీలలో భారీగా విదేశీ కరెన్సీ

● ఏటా రూ.40 లక్షల వరకు ఆదాయం

అన్నవరం, సెప్టెంబరు 3 : రత్నగిరివాసుడైన సత్యదేవుడు తెలుగుప్రజల ఆరాధ్య దైవంగానే కాకుండా విదేశీయుల తాకిడి క్రమంగా పెరుగుతూనే ఉంది. దీనికి ప్రధానంగా హుండీలలో విదేశీభక్తులు వేసే వివిధ దేశాల కరెన్సీ లభ్యమవడమే నిదర్శనం. గతంలో విదేశీ కరెన్సీ విలువ ఏడాదికి 5నుంచి ఆరులక్షలు మాత్రమే వస్తోండగా ప్రస్తుతం ఈ ఆదాయం రూ.40 లక్షలకు చేరుకుంటుంది. విదేశీ కరెన్సీలో అధిక భాగం యుఎస్ఏ డాలర్లదే కావడం గమనార్హం. తరువాత స్థానంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన దిరహమ్స్, సింగపూర్, కెనడా, మలేషియా, రష్యాలున్నాయి. విదేశీయులు స్వామివారి దర్శనం అనంతరం వారి దేశ కరెన్సీను హుండీలో సమర్పించి వారి దగ్గరున్న ఇండియన్ రూపీస్‌తో ఇతర అవసరాలకు వినియోగించుకుంటారు. వీటిని దేవస్థానం ఏవిధంగా భారత కరెన్సీగా మారుస్తుంది అనే అనుమానం రావచ్చు. దేవస్థానం అధికారులు ఏ నెలకు ఆనెల హుండీలను తెరిచి సిబ్బందితో లెక్కించి యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్‌లలో రొటేషన్ విధానంలో ఒక్కోనెల ఒక్కో బ్యాంక్‌లో జమచేస్తుంటారు. హుండీల లెక్కింపు సమయంలో వచ్చిన విదేశీకరెన్సీని ఆయా బ్యాంక్‌లు స్వీకరించి ఆరోజు విదేశీకరెన్సీలో ఏదేశ కరెన్సీ విలువ ఎంతుందో అంతే మొత్తాన్ని ఇండియన్ రూపీస్‌లో లెక్కకట్టి దేవస్థానం ఖజానాకు జమచేస్తారు. తరువాత వాటిని బ్యాంక్ అధికారులు రిజర్వ్‌బ్యాంక్‌కు పంపుతారు. హుండీల లెక్కింపులో అన్నిదేశాల విదేశీ కరెన్సీల విలువ నెలకు సుమారు రూ.40లక్షల వరకు ఉంటుందని అకౌంట్ విభాగ అధికారులు పేర్కొంటున్నారు.



హుండీల ద్వారా లభించిన కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

2016లో డీ మోనటైజేషన్‌లో రద్దయిన నోట్లు రూ.10లక్షలు

అన్నిరకాల నోట్లను దేవస్థానం నగదుగా మూర్చుకుంటున్న 2016లో ప్రధాని మోదీ నోట్ల రద్దు ప్రకటించిన రూ.500, రూ. 2000 నోట్లు ఇంకా హుండీలలో అక్కడక్కడా కనిపిస్తుండడం విశేషం. నోట్లు రద్దు తరువాత బ్యాంక్‌లు కొద్దికాలం వీటిని స్వీకరించినా గడువు ముగిసిన తరువాత విచ్చలవిడిగా దేశీయభక్తులు అవి బయట చెల్లుబాటుకాకపోవడంతో హుండీలలో సమర్పించేవారు. ఆ సమయంలో బ్యాంక్‌లు వీటిని తీసుకోకపోవడంతో అవి దేవస్థానం ఖజానాలో మూలుగుతున్నాయి. సుమారు రూ.10లక్షల వరకు ఆ నోట్లు దేవస్థానం లాకర్లలోనే ఉన్నాయి. దేవస్థానం అధికారుల బృందం రిజర్వ్‌బ్యాంక్ ప్రతినిధుల వద్దకు వెళ్లి వీటి గురించి ప్రస్తావించినా వారు కూడా తీసుకోకపోవడంతో దేవస్థానంలోనే ఉంచారు.

విశాఖ-విజయవాడ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట, సెప్టెంబరు 3: వరదలల కారణంగా ఇప్పటికే మూడు రోజులుగా పలు రైళ్లను రద్దు చేసిన నేపథ్యంలో ప్రయాణికులకు కాసింత వెసులుబాటు కల్పించేందుకు మంగళవారం నుంచి విశాఖ-విజయవాడల మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును నడుపుతున్నట్లు రైల్వే సీపీఆర్వో రమేష్ ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్ రమేష్ మంగళవారం అందించిన సమాచారం మేరకు ఈ ప్రత్యేక రైలు 08581తో విశాఖ నుంచి మంగళవారం మధ్యాహ్నం 12.55కి బయలు దేరిందన్నారు. సాయంత్రం 3.14కి సామర్లకోటకు చేరుకుని తిరిగి విజయవాడకు బయలుదేరింది. రాత్రి 7.15కి విజయవాడకు చేరుకుంటుందన్నారు. ఈ ప్రత్యేక రైలు పట్ల ముందస్తు సమాచారం లేకపోవడంతో రైలు ఖాళీగా విజయవాడకు తరలివెళ్లింది.

గౌతమి ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

కాకినాడపోర్టు-లింగంపలి-కాకినాడ పోర్టు మధ్య రాకపోకలు సాగించే 12737, 12738 నంబర్లు గల గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లను మంగళవారం రాత్రి నుంచి దారి మళ్లిస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులను సామర్లకోట రైల్వేస్టేషన్‌కు మంగళవారం రాత్రి జారీ చేశారు. భారీవర్షాల కారణంగా చేసిన ఈ మార్పుల కారణంగా కాకినాడ నుంచి బయలుదేరే గౌతమి ఎక్స్‌ప్రెస్ విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో గౌతమి ఎక్స్‌ప్రెస్ పగిడిపల్లి, గుంటూరు, విజయవాడల మీదుగా తిరిగి సామర్లకోట చేరుకుంటుందన్నారు.

వరద బాధితుల కోసం
అన్నవరం దేవస్థానం ఆపన్నహస్తం

● 10వేల పులిహోర ప్యాకెట్లు, 40 వేల వాటర్ ప్యాకెట్లు తరలింపు



పులిహోర ప్యాకెట్ల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, సెప్టెంబరు 3: అల్పపీడన ప్రభావం విజయవాడను అతలాకుతలం చేయడంతో అక్కడ వరదబాధితుల కోసం అన్నవరం దేవస్థానం ఆపన్నహస్తం అందించి తనవంతు పాత్ర పోషించింది. దేవస్థానం ప్రత్యేక వాహనాల ద్వారా అన్నవరంలో 10వేల పులిహోర ప్యాకెట్లను తయారు చేయించింది. దీంతోపాటుగా 40వేల వాటర్ ప్యాకెట్లను ప్రత్యేక వాహనంలో విజయవాడకు తీసుకెళ్లారు. ఈ వాహనాన్ని మంగళవారం ఉదయం ఈవో రామచంద్రమోహన్ జెండాఊపి ప్రారంభించారు. దేవస్థానం నుంచి కొందరి సిబ్బందిని ఆ వాహనాలలో పంపించి వారే నేరుగా బాధితులకు అందేలా చేయాలని ఈవో ఆదేశించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు దేవస్థానాల నుంచి ఆపన్నహస్తం అందించడం ఎప్పటినుంచో చేస్తున్నట్లు ఈవో తెలిపారు.

సత్యదేవుడి ప్రసాదానికి దేశఖ్యాతి

● అన్నవరం ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పత్రం అందజేత

అన్నవరం, సెప్టెంబరు 3: భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ అన్నవరం సత్యదేవుడి ప్రసాదానికి ప్రకటించిన గుర్తింపు పత్రాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దేవస్థానం ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్‌లకు అందజేశారు. సత్యదేవుడి ప్రసాదానికి దేశఖ్యాతి లభించడం అభినందనీయమని దేవస్థానం అధికారులు సిబ్బంది ఈ ఖ్యాతిని మరింత విస్తరించేందుకు కృషిచేయాలన్నారు. ఈవో రామచంద్రమోహన్ మాట్లాడుతూ భారత ఆహార సంస్థ సూచనలతో రుచి, శుచి, నాణ్యతతో ప్రసాదం తయారీచేస్తున్నామని వారు రెండేళ్లకు ఒకసారి దీనిపై ఆడిట్‌చేసి గుర్తింపుపత్రం రెన్యువల్ చేస్తుంటారని స్వచ్ఛమైన, అమృతమైన స్వామివారి గోదుమరవ్వ ప్రసాదం తయారీలో రాజీపడబోమని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ రోహిత్, పీఆర్వో కృష్ణారావు, నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే సత్యప్రభ స్వామిని దర్శించుకోగా వారికి ఆలయ ఈవో రామచంద్ర మోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు.



ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పత్రాన్ని ఈవో, ఛైర్మన్‌లకు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ



శ్రీపాదశ్రీవల్లభులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీపాద శ్రీవల్లభులకు
సహస్ర చామంతి పుష్పపూజ

పిఠాపురం, సెప్టెంబరు 3: కాకినాడజిల్లా పిఠాపురంలో శ్రీపాదవల్లభులకు చామంతి పుష్పాలతో పూజ జరిగింది. పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం విశేషపూజలు జరిగాయి. సహస్ర చామంతి పుష్పపూజ నిర్వహించారు. శ్రీపాదవల్లభుని పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే మూల మంత్ర అనుష్టానం జరిగాయి. సాయంత్రం పల్లకిసేవ జరిగింది. భక్తులు గురుచరిత్ర, శ్రీపాదవల్లభ చరితామృత గ్రంధ సామూహిక సప్తాహ పారాయణం చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి

● 2,99,814 క్యూసెక్కుల నీరు దిగువకు..



కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

ధవళేశ్వరం, సెప్టెంబరు 3: ఉపనదులు ప్రాణహిత, మంజీర నుంచి వరద నీరు గోదావరికి చేరుతుండడంతో కాళేశ్వరంవద్ద నీటి మట్టం పెరుగుతుంది. దీని ప్రభావంతో ఎగువున భద్రాచలంవద్ద నీటిమట్టం వేగంగా పెరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చి చేరే వరద నీటి ప్రవాహాన్ని అంచనావేస్తూ ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ మొత్తం 175 గేట్లను ఆర్‌క్లియర్ పొజిషన్‌లో ఉంచి గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. దీంతో మంగళవారం ఉదయం 7.20 అడుగులుగా ఉన్న నీటిమట్టం సాయంత్రానికి 6.20అడుగులుగా నమోదు కాగా 2,99,814 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద సుమారు 9లక్ష క్యూసెక్కుల వరద తరలిరావచ్చని, 11అడుగులకు పైగా నీటి మట్టం చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద తెల్లవారుజామున 2గంటలకు నీటిమట్టం 25.70అడుగులుగా ఉండగా సరాసరి గంటకు 1పాయింట్ చొప్పున పెరుగుతూ సాయంత్రం 6గంటలకు 38.50అడుగులకు చేరుకుంది. మొదటి ప్రమాదహెచ్చరిక స్థాయి 43 అడుగుల వరకు నీటిమట్టం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

రూ.18 లక్షలకే
కేజీ బంగారం అంటూ కుచ్చు టోపీ

● ఈజీ మనీ కోసం మోసపోయిన ఆర్ఎంపీ వైద్యుడు

కూనవరం, సెప్టెంబర్ 3: ఈజీ మనీ కోసం ఓ నలుగురు రూ.18లక్షలకే కేజీ బంగారం వస్తోందనే ఆశతో వారి ఉచ్చులోపడి మోసపోయిన సంఘటన కూనవరంలో చోటుచేసుకుంది. అల్లూరి జిల్లా కూనవరం మండలానికి చెందిన ఓ ఆర్ఎంపీ వైద్యుడితోపాటు మరో ముగ్గురు ఈ మోసం ఉచ్చులో పడిపోయారు. మండలంలో నివశిస్తున్న ఈ వైద్యుడి దగ్గరకు పిట్టల మందు అమ్ముకునే ఓ వ్యక్తి వచ్చాడు. కొంతసేపు ఆర్ఎంపీ వైద్యుడితో మాట్లాడాక నా దగ్గర రూ.18లక్షలకే కేజీ బంగారం ఉందని ఆ సొమ్ము ఇస్తే బంగారం ఇస్తానంటూ నమ్మించాడు. ఆ మాయమాటల్లో పడిపోయిన ఆర్ఎంపీ వైద్యుడు మరో ముగ్గురు స్నేహితులకు ఈవిషయాన్ని చెప్పాడు. అందరూ చర్చించుకుని ఎక్కువ బంగారం వస్తోందన్న ఆశతో ఈ డీల్ కుదుర్చుకున్నారు. ఆ బంగారం బెంగుళూరులో ఉందని పిట్టల మందు అమ్ముకునే వ్యక్తి తెలిపారు. ఈ నలుగురు రెండుసార్లు బెంగుళూరు వెళ్లారు. అనంతరం బెంగుళూరు, ఆంధ్రా సరిహద్దుల్లో బంగారం తనిఖీ చేసుకునేందుకు సిద్ధపడ్డారు. బెంగుళూరుకు చెందిన కొంతమంది వ్యక్తులు బంగారం పరిశీలించుకోవడానికి రెండు బంగారు ముక్కలు ఇచ్చారు. అవి ఒరిజినల్ కావడంతో మిగతా ఆ కేజీ బంగారం పరిశీలించకుండా తీసుకొచ్చారు. తీరా ఇంటికొచ్చాక ఆ బంగారం నకిలీ కావడంతో నిండా మోసపోయామంటూ ఇప్పుడు లబోదిబోమంటున్నారు.

వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాలకు
1,600 అరటి గెలలు

రావులపాలెం, సెప్టెంబరు 3: వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాలకు రావులపాలెం నుంచి అరటి గెలలను తరలించారు. మార్కెటింగ్ శాఖ ఆదేశాల మేరకు ఆర్జేడీఎం పి.సుధాకరరావు పర్యవేక్షణలో కోనసీమ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి పి.విశాలాక్షి, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.యశ్వంతరావు రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో 1,600 కర్పూర రకం అరటి గెలలను కొనుగోలు చేశారు. మంగళవారం వాటిని లారీల్లో వర్ష ప్రభావిత ప్రాంతాలకు తరలించారు. కార్యక్రమంలో అంబాజీపేట, ఆలమూరు ఉన్నత శ్రేణి కార్యదర్శులు ఐ.రమేష్, గోవిందరెడ్డి, సూపర్‌వైజర్లు వి.శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.



రావులపాలెం అరటి మార్కెట్‌యార్డు నుంచి విజయవాడ తుఫాన్ ప్రభావిత ప్రాంతానికి తరలించేందుకు సిద్ధం చేసిన అరటి గెలలు

యువకుడి దాడిలో
వృద్ధురాలి మృతి

తుని రూరల్, సెప్టెంబరు 3: యువకుడి దాడిలో వృద్ధురాలి మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట పంచాయతీ శివారు గవరపేటలో జరిగింది. గవరపేటకు చెందిన వేగి ఆనంద్, తండ్రి నల్లబాబు పొలంలో అదే గ్రామానికి చెందిన పక్క పొలం రైతు భార్య వేగి సుబ్బలక్ష్మి(68)కి ఆనంద్‌కి మధ్య స్థలవివాదంపై ఘర్షణ చోటు చేసుకోవడంతో మంగళవారం ఆనంద్ సుబ్బలక్ష్మిపై దాడి చేయడంతో సుబ్బలక్ష్మి మరణించింది. దీంతో కుటుంబ సభ్యులు తుని రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ కృష్ణామాచార్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైకో పాలనలో వెనుదిరిగిన పరిశ్రమలను రప్పిస్తాం

● కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ



మెగా దంత వైద్య శిబిరాన్ని సందర్శించి పళ్ళ సెట్టును అందజేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

అనపర్తి, సెప్టెంబరు 3: రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరిగిన సైకో పాలనతో అనేక పరిశ్రమలు తరలిపోయాయని మరికొన్ని పరిశ్రమలు పెట్టుబడి పెట్టేందుకు వెనుకంజ వేశాయని వీటన్నిటినీ తిరిగి ఆహ్వానించి పరిశ్రమలను నెలకొల్పి అనేక మందికి ఉపాధి కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం అనపర్తి మండలం పొలమూరులోని శ్రీదేవి ఫంక్షన్ హాల్లో మూడు రోజులుగా నల్లమిల్లి మూలారెడ్డి చారిటబుల్ ట్రస్టు, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా దంత వైద్యశిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నూతనంగా పెట్టుబడులు ఆకర్షించేందుకు ముఖ్యమంత్రితో కలిసి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు బుధవారం ప్రారంభంకానున్నాయని చెప్పారు. పొలమూరులో జరిగిన దంత వైద్య శిబిరంలో సేవలను పరిశీలించారు. రోగులకు ఉచితంగా అందించే పళ్ల సెట్లను మంత్రి అందజేశారు. నెల రోజులపాటు జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల మొత్తం వైద్య సేవలకు అంకితం కావడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ వేమగిరి-సామర్లకోట కెనాల్‌రోడ్డు అభివృద్ధికి మంత్రి సహకరించాలని కోరారు. దంత వైద్య శిబిరం నిర్వహించిన జీఎస్ఎల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. జీఎస్ఎల్ ట్రస్టు ఎంపీ డాక్టర్ సందీప్‌ను, మంత్రి శ్రీనివాసవర్మను ఘనంగా సత్కరించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు శివరామ కృష్ణంరాజు, సిరసపల్లి నాగేశ్వరరావు, ఆళ్ల గోవిందు, దత్తుడు శ్రీను, పాల్గొన్నారు.

పరిశ్రమ ఆధారిత కోర్సుల రూపకల్పనకు
రిలయన్స్‌తో ఎంవోయూ

● సమీక్షలో జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 3: వర్సిటీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా పరిశ్రమ ఆధారిత కోర్సుల రూపకల్పన, ఇంటర్న్‌షిప్స్, పరిశోధనలు, కన్సల్టెన్సీ సేవలు అందించేందుకుగాను త్వరలో ఎంవోయూ కుదుర్చుకోనున్నామని ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. గాడిమొగలోని రిలయన్స్ కార్యాలయంలో సంస్థ ప్రతినిధులతో మంగళవారం జేఎన్టీయూకే అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రిలయన్స్‌లోని స్కిల్డ్ ప్రొఫెషనల్స్‌కు ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులు అందించేందుకుగాను చర్చలు జరిపామన్నారు. అనంతరం రిలయన్స్ ప్రతినిధులు తమ సంస్థలో సంభవించే సాంకేతిక అవరోధాలకు సత్వరపరిష్కారం అందించాలని కోరారు. దీనిపై వర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించారు. సమీక్షలో ఓఎస్‌డీ కోటేశ్వరరావు, పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ వి.రవీంద్ర, సీఈ శ్రీనివాసులు, డైరెక్టర్లు గోపాలకృష్ణ, బీటీ కృష్ణ, చక్రవర్తి, వెంకటరెడ్డి రిలయన్స్ ప్రతినిధులు సుబ్బారావు, మురళీధర్, రెబెల్లో, ప్రసాద్, వేణుగోపాలరాజు పాల్గొన్నారు.



రిలయన్స్ ప్రతినిధులతో జేఎన్టీయూకే అధికారులు

అమలాపురంలో
క్షుద్ర పూజల కలకలం!



అమలాపురంలో క్షుద్ర పూజలు జరిగింది ఇక్కడే

అమలాపురంటౌన్, సెప్టెంబరు 3: జాతీయ రహదారిని ఆనుకుని అమలాపురం కళాశాల రోడ్డులో ఉన్న దుకాణ సముదాయం, ఇళ్ల వద్ద జరిగిన క్షుద్ర పూజలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న సందులో దారి పొడవునా గృహాలు, దుకాణాల ముందు నిమ్మకాయలు ఉంచి పసుపు, కుంకుమ చల్లి నల్లని తాళ్లు కట్టారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంటి ముందు క్షుద్ర పూజలు నిర్వహించినట్టు భావిస్తున్నారు. ఎర్ర రంగు నీళ్లు, సూదులతో గుచ్చిన నిమ్మకాయలు, నల్లతాడుతో బంధించిన కోడిగుడ్లను పగులకొట్టడం... ఇలా ఎన్నో చేశారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వచ్చిన తంగెళ్ల సత్యనారాయణమూర్తి, మాణిక్యాలరావు కుటుంబ సభ్యులు తమ ఇంటి ముందు క్షుద్ర పూజలు జరిగాయని, కావాలని ఎవరో చేతబడి చేసినట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని అమావాస్య అర్ధరాత్రి చేతబడులు చేశారనివారు ఆరోపిస్తున్నారు. తంగెళ్ల సోదరులు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ కె.క్రిష్టఫర్ తెలిపారు.

పిఠాపురంలో వ్యక్తిపై హత్యాయత్నం

పిఠాపురం, సెప్టెంబరు 3: కాకినాడజిల్లా పిఠాపురంలో ఒక వ్యక్తిపై హత్యాయత్నం కలకలం సృష్టించింది. పట్టణంలోని మంగాయమ్మరావుపేటకు చెందిన కొర్రా సత్యనారాయణ కొంతకాలంగా చిట్‌ఫండ్ కంపెనీ నిర్వహిస్తున్నారు. దీని విషయంలో రెండేళ్ల క్రితం వ్యాపార భాగస్వాముల మధ్య వివాదాలు తలెత్తగా కేసులు పెట్టుకున్నారు. ఇవి కోర్టులో ఉన్నాయి. మంగళవారం ఉదయం సత్యనారాయణ సాయిబాబా గుడి సెంటర్ వద్ద మోటార్‌సైకిల్‌తో ఉండగా అతని పార్టనర్ ఎల్.భాస్కర్ అనే వ్యక్తివచ్చి పాదగయ సెంటర్ వద్ద దించమని అడిగాడు. అతనిని మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని పిఠాపురం బైపాస్‌రోడ్డు మీదుగా వెళుతుండగా శ్రీచైతన్య స్కూలు వద్దకు వచ్చేసరికి భాస్కర్ కత్తి తీసుకుని సత్యనారాయణను పొడిచి అతనివద్ద ఉన్న రూ.1.50లక్షలను తీసుకుని పరారయ్యాడు. గాయపడిన సత్యనారాయణ చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. సత్యనారాయణ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనపై సీసీ కెమేరా దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. చిట్‌ఫండ్ కంపెనీ వివాదాల నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగినట్లు భావిస్తున్నారు.

పసలపూడిలో పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయవరం, సెప్టెంబరు 3: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రాయవరం మండలం పసలపూడిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుని పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు రాయవరం ఎస్ఐ పి.బుజ్జిబాబు మంగళవారం రాత్రి తెలిపారు. గ్రామంలో బియ్యం అక్రమ రవాణ జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంపై విజిలెన్స్, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో అక్రమంగా తరలిస్తున్న 3వేల 110 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన బియ్యం విలువ 1లక్షా 43వేల 60 రూపాయలు ఉంటుందని, రూ.4లక్షల విలువైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని వాహన యజమాని నాగిరెడ్డి సీతారామయ్య, డ్రైవర్ బాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


వరద నీరే...తాగు నీరై

● తాగునీరు లేక సింగంపల్లి గ్రామస్థుల వెతలు
● ఉధృతంగా ప్రవహిస్తున్న మడేరు వాగు



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో నీరు సేకరిస్తున్న గ్రామస్థులు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు కొండ వాగులు ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తున్న సంగతి తెలిసిందే , అయితే మండలంలోని సింగంపల్లి గ్రామస్థులు మాత్రం తాగేందుకు మంచినీరు లేక వరద నీటిని తాగుతున్నారు. సింగంపల్లి గ్రామంలో సుమారు 600 మంది జనాభా ఉంటారు. ప్రధాన రహదారితో సంబంధం లేకుండా కాలువ ఆవల గ్రామం ఉండటంతో గ్రామంలో ప్రజలు ఏమైపోయినా పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. ఆ గ్రామ ప్రజలకు మొదటి నుంచి తాగునీటికి ఇబ్బందులే. 2017లో ఐటీడీఏ ద్వారా గ్రామంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటుచేశారు. అయితే ఆర్వో ప్లాంటు గత రెండేళ్లుగా పనిచేయట్లేదు. ఈ విషయాన్ని ప్రజలు అప్పటి అధికారులు, పాలకుల దృష్టికి తీసుకొని వెళ్లిన పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. దీంతో వారికి వేరే గత్యంతరం లేక సమీపంలో ఉన్న మడేరువాగు వద్ద సెలములు ఏర్పాటు చేసుకొని(వాగు సమీపంలో గొయ్యి తీసి) అక్కడ ఇంకిన నీటినే తేర్చి, గత రెండేళ్లుగా ప్రజలు తాగుతున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మడేరు వాగుకు వరద ప్రవహం పోటెత్తింది. దీంతో నీరు బురద, తదితర వ్యర్థాలతో పూర్తిగా కలుషితమైంది. ఆ విషయం తెలిసిన తాగునీటికి వేరే ఆస్కారం లేక వరద నీటినే గ్రామస్థులు తీసుకొని వెళ్లి మంచినీటిగా సేవిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తాత్కాలికంగా ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని లేదా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సింగంపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న మడేరు వాగు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

అల్లవరం, సెప్టెంబరు 3: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద విద్యార్థులైన అభిమానులు కేక్ కట్ చేసి జరుపుకున్నారు. బాణసంచా కాల్చారు. కొమరగిరి పట్నం పంచాయతీ పరిధిలో పలచోళ్ల వేణు సమకూర్చిన కొబ్బరి మొక్కలను జనసైనికులు నాటారు. బోడసకుర్రులో కేక్ కట్ చేశారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, చింతా శ్రీనివాస్, అడపా వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఓలేటి పరమేశ్వరరావు, రోళ్ల శ్రీనివాస్, ముత్యాల బాబి పాల్గొన్నారు.

సీరియస్‌గా స్పందించకపోతే సాగు చేయలేం

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 3: సమస్యలపై సీరియస్‌గా స్పందించకపోతే వ్యవసాయం చేయలేమంటూ రైతులు ఆర్డీవో ఎదుట తమ కష్టాలను ఏకరవు పెట్టారు. అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి మంగళవారం గొల్లవిల్లిలో ముంపులో ఉన్న గొరగనమూడి డ్రెయిన్ ఆయకట్టు పొలాలను పరిశీలించారు. నాట్లువేసిన చేలల్లో కలువల పంటను ఆయన చూసి ఆశ్యర్యానికి లోనయ్యారు. సార్వా నాట్లు ప్రారంభం నుంచే ముంపు కష్టాలను కాట్రేనికోన నీటి పంపిణీ సంఘం మాజీ ఛైర్మన్ అరిగెల నానాజీ, రైతు నాయకులు అడబాల సత్యనారాయణ, మంచెం బాలకృష్ణ వివరించారు. కేవలం డ్రెయిన్లు, పంట కాల్వలను పట్టించుకోకపోవడం వల్లే తమకు సాగు కష్టాలు, నష్టాలు తప్పట్లేదన్నారు. డ్రెయిన్లలో చేపల వలకట్లు మరింత సమస్యగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉప్పలగుప్తం, పేరాయిచెరువు ముంపు పరిస్థితిని సలాది శ్రీనివాసరావు, చిక్కం సూర్యమోహన్, సలాది నాగరాజు వివరించారు. ఆక్వా చెరువుల్లోని వ్యర్థాలను డ్రెయిన్లలోకి వదలడంతో అవి పూడుకుపోతున్నాయన్నారు. వ్యవసాయాధికారి జి.కుమార్ బాబు మండలంలోని సార్వా పరిస్థితిని ఆర్డీవోకు వివరించారు. తహసీల్దార్ వాసా దివాకర్ పాల్గొన్నారు.



గొరగనమూడి డ్రెయిన్ ఆయకట్టు పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

బాధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు: ఆర్డీవో

నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని ఆర్డీవో కేశవర్ధనరెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అమలాపురం డివిజన్‌లో ఉప్పలగుప్తం మండలంలోనే వ్యవసాయానికి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. డివిజన్లో 27వేల ఎకరాల్లో సార్వా సాగు జరగ్గా ఉప్పలగుప్తం మండలంలో 4,220 ఎకరాల్లో నాట్లు పడ్డాయని, ఎంత విస్తీర్ణంలో ఏమేరకు నష్టం జరిగిందో సర్వే చేయిస్తున్నామన్నారు. డ్రెయిన్ల సమస్యపై కలెక్టర్ దృష్టి సారించారని, కూనవరం మేజర్ డ్రెయిన్ సహా డ్రెయిన్ల సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. చేపల వలకట్లు తొలగింపు అంశంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆర్థిక సాయం అందజేత

మండపేట, సెప్టెంబరు3: మండపేట గాంధీనగర్‌కు చెందిన చింతా కిరణ్‌కుమార్ బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడు తున్నాడు. ఆ కుటుంబానికి మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకర్గ ఇన్‌చార్జి వేగుళ్లలీలాకృష్ణ రూ.20వేలు అందించారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

రావులపాలెం, సెప్టెంబరు3: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది సీఆర్సీ రోడ్డులో మంగళవారం నినాదాలు చేశారు. నూతన మద్యం పాలసీతో ఉద్యోగాల పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు.

మెగా రక్త దాన శిబిరం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 3: అంగరలో మంగళవారం వాసవీ, వనిత, వీకేఎస్‌పీ, వారియర్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్లకూరి ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి ఫ్రూట్స్, డ్రింక్స్, డ్రైఫ్రూట్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం బ్లడ్‌బ్యాంక్ నిర్వహణకు వచ్చిన వైఎస్ఆర్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్‌సెంటర్ డాక్టర్లను క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్ సత్కరించారు. క్లబ్‌సభ్యులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

రాయవరం, సెప్టెంబరు3: బీజేపీ సభ్యత్వకార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని బీజేపీ పదాధికారి కర్రి చిట్టిబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇన్‌చార్జి కోన సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారంరాయవరంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సెల్: 8800002024కి కాల్‌చేస్తే సభ్యత్వ నమోదు అవుతుందన్నారు. బీజేపీ నాయకులు లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, శాకా దుర్గా శ్రీనివాస్, నరాల రాంబాబు, కోటిపల్లి సాయిరాం, వల్లభనేని రవీంద్రబాబు, గొడవర్తి రామచంద్రరావు, మద్దుల సుబ్బారావు, పాలిక రమణ, బుద్దవరపు రాజు, పాలిక రమణ, బుద్దవరపురాజు, వృత్సా ప్రసాద్, ఈరేళ్ల కృష్ణమూర్తి, ముప్పాటి కృష్ణ, చిర్ల సుబ్బారావు, పిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాయవరం, సెప్టెంబరు 3: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మాచవరం పీహెచ్‌సీ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

ఆత్రేయపురం, సెప్టెంబరు3: మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్ సూచించారు. ఎవరికీఇబ్బంది కలగకుండా పందిళ్లు ఏర్పాటు చేసుకుని ఉత్సవాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అశ్లీల నృత్యాల నిర్వహణ, నిమజ్జనం సమయంలో నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు.

రావులపాలెం: వినాయకచవితికి గ్రామాల్లో ఏర్పాటు చేసే మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని రావులపాలెం టౌన్ సీఐ జేమ్సురత్నప్రసాద్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో పండుగ చేసుకోవాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఆత్రేయపురం: స్థానికమహర్షి స్కూల్‌లోమంగళవారం ఎస్ఐ శ్రీనివాస్ అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల పట్ల జరిగే నేరాలు, భద్రత, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నపూర్ణదేవి సేవా సంస్థ సేవలు అభినందనీయం

రావులపాలెం, సెప్టెంబరు 3: శ్రీకాశీ అన్నపూర్ణదేవి సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం రావులపాలెంలో సేవా సమితి రెండో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పేదలకు నిత్యావసరాల కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం సేవా సమితి సభ్యులు బండారును సత్కరించారు.

అక్రమ వసూళ్లపై ఫిర్యాదు

ముమ్మిడివరం, సెప్టెంబరు3: ముమ్మిడివరం మండలమాల మహానాడు పేరిట గతనెల21న భారత్‌బంద్ పిలుపుతో ముందురోజు కొంతమంది యువకులు ముమ్మిడివరంలోని ప్రైవేటు ఆసుపత్రులు, వ్యాపారసంస్థలు, మార్కెటింగ్ యార్డు కార్యదర్శి వద్ద రూ.80వేలవరకు వసూలుచేసినట్టు మండల మాలమహానాడు, జేఏసీ నాయకులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీకెమెరా పుటేజీల ఆధారంగా వ్యక్తులను గుర్తించామన్నారు. నాయకులు దేవరపల్లి ఏడుకొండలరావు, కాశి జగపతిరావు, మెండి కృష్ణబాబు, చీకురుమెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ధర్నా

ద్రాక్షారామ, సెప్టెంబరు 3: ద్రాక్షారామ పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆశావర్కర్లు ధర్నా జరిపారు. ఆశావర్కర్ల వేతనాలు పెంచాలని, 2024 ఫిబ్రవరిలో ప్రభుత్వం ఆశావర్కర్ల ప్రతినిధులతో జరిపిన చర్చలు ఫలితంగా జరిగిన ఒప్పందాల మేరకు జీవోలు విడుదల చేయాలని డిమాండు చేశారు. డిమాండ్లు నెరవేర్చాలంటూ నినాదాలు చేశారు. వినతిపత్రాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ ప్రశాంతికి అందజేశారు. కార్యక్రమంలో వర్కర్ల యూనియన్ నాయకులు సుబాషిణి, దేవి పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర సహ కన్వీనర్‌గా చిన్నారి

ఆత్రేయపురం,సెప్టెంబరు3: బీజేపీసభ్యత్వ నమోదురాష్ట్ర సహ కన్వీనర్‌గాఆత్రేయపురానికి చెందిన కాలాబత్తుల చిన్నారిని నియమించినట్టు యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వంశీకృష్ణ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిఅభినందించారు.

రైతులు ఈకేవైసీని త్వరితగతిన పూర్తిచేయాలి

మామిడికుదురు, సెప్టెంబరు 3: రైతుల ఈకేవైసీని త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు పేర్కొన్నారు. నగరంలోని వరి పొలాలను వ్యవసాయాధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. ముంపు నీటి బారిన పడిన పొలాలను పరిశీలించి నీరు దిగిన తరువాత ఎకరాలకు 20కిలోల యూరియా, 20కిలోల పొటాష్‌ను వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త నందకిశోర్, ఏరువాక కేంద్రం పీడీ వై.జ్యోతిర్మయి, ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్, ఏవోలు మనోహర్ బృందంతో పాటు ఏడీఏ ఏజేవీ రామ్మోహనరావు, ఏవో మృదుల వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురు: నగరంలో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారుల బృందం

ఈనెల15కి ఈక్రాప్ పూర్తిచేయాలి

అంబాజీపేట, సెప్టెంబరు 3: ఈనెల 15వతేదీ నాటికి ఈక్రాప్ పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు సూచించారు. చిరతపూడిలో ఈక్రాప్ నమోదును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ ఈ క్రాప్‌పై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈక్రాప్ చేసుకుంటే రైతులు వర్షాభావం కారణంగా పంట నష్టపోతే ప్రభుత్వం ద్వారా పరిహారం వస్తుందన్నారు. తొలుత సొసైటీల్లో ఉన్న ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఈక్రాప్ నమోదుపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, వైస్ఎంపీపీ నేతల నాగరాజు, ఎఈవో దుర్గారావు, వీహెచ్ఏ రవితేజ, రైతులు బొడ్డు రామకృష్ణ, లూటుకుర్తి నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట ఇన్‌చార్జి ఆర్డీవోగా సుధాసాగర్

కొత్తపేట, సెప్టెంబరు 3: కొత్తపేట ఇన్‌చార్జి ఆర్డీవోగా రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్‌ను నియమిస్తూ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆర్డీవోగా ఉన్న జీవీవీ సత్యనారాయణ, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు తహసీల్దార్లను కృష్ణా వరద చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లారు. దీంతో సుధాసాగర్‌కు బాధ్యతలు అప్పజెప్పారు.

ముంపు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడండి



కేశవదాసుపాలెం అగస్టిన్ కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, సెప్టెంబరు 3: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన కేశవదాసుపాలెంలోని అగస్టిన్ కాలనీ, మెండుపాలెం రంగా సెంటర్, మారెమ్మ గుడి పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సందర్శించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముంపు నీటిని బయటకు మళ్లించడానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తుపాను సమయంలో ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలకు మంచినీరుతో సహా ఏవిధమైన ఇబ్బంది లేకుండా చూడాలని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అంతర్వేదిపల్లిపాలెం తదితర తీర ప్రాంతాల్లో కూడా పల్లపు ప్రాంతాలు నీట మునిగాయని, ప్రధాన రహదారి జలమయమయ్యాయని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దృష్టికి తీసుకువెళతామని అంతర్వేది తీరప్రాంత ప్రజలు తెలిపారు. గుండుబోగుల పెద్దకాపు, గుబ్బల ఫణికుమార్, చాగంటి స్వామి, ఉండపల్లి అంజి, బెల్లంకొండ పుత్రయ్య, శంకరగుప్తం ముత్యం, యెనుముల తాతాజీ, బెల్లంకొండ తిమోతి, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, కూటమి శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.

అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు తొలి అడుగులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 3: అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కృషి ఫలితంగా జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు తొలి అడుగులు పడ్డాయి. అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సంబంధించి కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సంబంధిత సమాచారం, ఇతర వివరాలను సేకరించేందుకు కమిషనర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ డాక్టర్ చప్పిడి కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేని లోటును ఎమ్మెల్యే ఆనందరావు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన తక్షణం స్పందించారు. త్వరలోనే అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వచ్చే అవకాశం ఉంది. డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే ఆనందరావుతో పాటు ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ)లకు అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో మంగళవారం జరిగిన సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, కామన్‌మెన్ ఫౌండేషన్ అధ్యక్షుడు కాశి చంద్రమౌళి, పీడీఎస్‌యూ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

విజయవాడ వరద సహాయక చర్యల్లో ఎమ్మెల్యేలు ఆనందరావు, బుచ్చిబాబు





అమలాపురంటౌన్/ముమ్మిడివరం, సెప్టెంబరు 3: ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు విజయవాడ వరద ముంపు ప్రాంతానికి అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేరుకున్నారు. మంగళవారం బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు విజయవాడ 60,61 డివిజన్లలో మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో కలిసి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు వరద సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

పవన్‌కుమార్ జన్మదిన వేడుకలు



అమలాపురం టౌన్, సెప్టెంబరు 3: బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన స్వగృహం వద్ద నిర్వహించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ముమ్మిడివరం, పి.గన్నవరం ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, గిడ్డి సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరుకాగా పవన్‌కుమార్ కేక్ కట్ చేశారు. వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వైద్య పరీక్షలు అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ నల్లా విష్ణుమూర్తి, టీడీపీ రాష్ట్ర నాయకులు నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, నల్లా దుర్గారావుపాల్గొన్నారు.

ఆచార్యులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



యానాం, సెప్టెంబరు 3: యానాం ఇందిరాగాంధీ బాలికల పాఠశాల హెచ్ఎం వి.వి.ఎస్.పి.ఎస్.ఎన్.ఆచార్యులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. పుదుచ్చేరిలో ఈనెల5న జరిగే కార్యక్రమంలో గవర్నర్, సీఎం విద్యా శాఖ మంత్రి నుంచి ఆయన అవార్డును అందుకుంటారు. విద్యాశాఖాధికారి, ఉపాధ్యాయులు అభినందించారు.

మహ్మద్ ప్రవక్తలకు ఘన నివాళులు

మామిడికుదురు, సెప్టెంబరు 3: ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్త, హజరత్ ఇమామ్‌హసన్‌లకు మంగళవారం ముస్లింలు ఘన నివాళులర్పించారు. ప్రవక్తల షహదత్‌ను పురస్కరించుకుని ఇమామ్‌హసన్, మహ్మద్ ప్రవక్తల గుమ్మటాలను మామిడికుదురు, నగరం గ్రామాల్లో గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహిస్తూ ఊరేగింపు చేశారు. సర్కిల్ ఫర్హత్ అలీబేగ్ ఆధ్వర్యంలో మర్షియా ఆలపిస్తూ నగరం బడేబీబీ పంజా వరకు గుమ్మటాలను ఊరేగించారు. బడేబీబీ పంజాలో జరిగిన షహదత్ మజ్లిస్‌లో మత ప్రబోధకుడు మహ్మద్ తఖీ మజ్లిస్‌ను ఆలపించారు. అనంతరం గుమ్మటాలను శాంతింపచేసి అన్నసమారాధన ఏర్పాటుచేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

టాటామేజిక్ ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక

ముమ్మిడివరం, సెప్టెంబరు 3: ముమ్మిడివరం మండల టాటామేజిక్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా యల్లమిల్లి వెంకటేశ్వరరావు (పెద్ద) ఎన్నికయ్యారు. ముమ్మిడివరం ఆర్టీసీ కాంప్లెక్సు రోడ్డులో షిర్డిసాయి ఆలయం వద్ద మంగళవారం టాటా మేజిక్ ఆటో యూనియన్ సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో నూతన అధ్యక్షుడిగా యల్లమిల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా కొమనాపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా రెడ్డి నాగేశ్వరరావు, కోశాధికారిగా బొక్కా కృష్ణార్జునతో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులతో కమిటీ ఎన్నిక జరిగింది. నూతన కార్యవర్గాన్ని టాటా మేజిక్ ఆటో యూనియన్ యజమానులు, డ్రైవర్లు పూలమాలలతో సత్కరించి అభినందించారు.

పీహెచ్‌సీకి వైద్య బృందం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 3: ముచ్చుమిల్లి పీహెచ్‌సీకి జాతీయ నాణ్యతా ప్రమాణాల అంచనా వైద్య బృందం పరిశీలించింది. డాక్టర్ దేవేంద్రకుమార్ బిటోరియా, డాక్టర్ తులసి వైద్య బృందం ఆసుపత్రిలో వైద్యసేవలపై ఆరా తీశారు. సోమవారం నుంచి ప్రతీవిభాగం,రికార్డులు తనిఖీచేసింది. జిల్లాక్వాలిటీ కన్సల్టెంట్ కె.సునీత, వైద్యులు కృష్ణ హరీష్, హేమసుందర్ ఆధ్వర్యంలో 12రకాల సేవలుపరిశీలించారు.

తిరుమల పాదయాత్రకు స్వాగతం

ఆలమూరు, సెప్టెంబరు 3: గత ప్రభుత్వం చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు తొలగాలని, ప్రజలను ఇబ్బందులపాలు చేయడం నుంచి విముక్తి కల్పించాలని, కూటమి ప్రభుత్వం భారీ విజయం సాధించాలని కోరుతూ కాకినాడకు చెందిన చిరుకూరి శ్రీనివాస్‌చౌదరి, ఏలూరి లోకేష్ మొక్కుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారు కాకినాడ నుంచి తిరుమలకు పాదయాత్ర మొదలుపెట్టారు. వారికి ఆలమూరులో కూటమి నాయకులు మంగళవారం స్వాగతం పలికియాత్ర విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

అమలాపురంరూరల్, సెప్టెంబరు3: ఇంజనీరింగ్‌తో పాటు ఇతర ఉన్నత విద్యలు అభ్యసించే ప్రతిభావంతులైన సంఘ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని శ్రీకోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రకటించారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తామన్నారు. చేనేత రంగంఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. బండారులంకలోని శ్రీఉమారామలింగ చౌడేశ్వరి దేవస్థానం కల్యాణ మండపంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దేవాంగ సంక్షేమ సంఘ 50వవార్షికోత్సవాన్ని నిర్వహించే అంశంపై చర్చించారు. చేనేతల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని పలువురు పేర్కొన్నారు. కార్యదర్శి పుత్సల వరదరాజు, చింతా వీరభద్రేశ్వరరావు, దైవపు నందయ్య, పిచ్చిక శ్యామ్, బల్ల వెంకటేశ్వరరావు, కాశిన గౌరీమల్లికార్జునుడు, గుంటు పాండురంగ, కటకం ధనలక్ష్మీశ్వరరావు, మాడా రాము, ములికి విఘ్నేశ్వరుడు, చింతపట్ల గంగాసత్యనారాయణ పాల్గొన్నారు.

రెడీమేడ్ గృహోపకరణాలపై ఆంక్షలు విధించాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 3: వేపకర్రతో కిటికీలు, గుమ్మాలు తయారుచేసి టింబరు డిపోల్లోనే విక్రయించడం వల్ల కార్పెంటర్లు, చేతివృత్తిదారులు జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవాసంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో తహసీల్దార్ జీడీ కిశోర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు దృష్టి సారించి భవన నిర్మాణ గృహోపకరణ వస్తువులపై ఆంక్షలు విధించి చేతివృత్తిదారుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు పితాని బేబిరావు, కొనుకు వెంకటేశ్వరరావు, గున్నేపల్లి భీమశంకరం, కేతా సోమేశ్వరరావు, దంగేటి రామకృష్ణ, కొవ్వూరి శ్రీనివాసరావు, కుసుమే నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: మిస్టర్ బచ్చన్
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
శేఖర్ స్క్రీన్-2	: డబుల్ ఇస్మార్ట్
రమా	: ఆయ్
గణపతి	: రేవు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: తంగలాన్

సమాజసేవ చేసే నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలి

పి.గన్నవరం, సెప్టెంబరు3: ప్రతి యువ రాజకీయ నాయకులు సమాజంలో సేవ చేసే నాయకులను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ పుట్టినరోజు సందర్భంగా కె.ఏనుగుపల్లిలో ఏర్పాటుచేసిన సేవా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. తొలుత నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబుతో కలిసి ఉచిత కంటివైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు అందించారు. గ్రామస్తులు నాయకులను, కూటమి నేతలను సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంసాని పెద్దిరాజు, చెరుకూరి గోపాలకృష్ణ, వాసంశెట్టి కుమార్, మట్టపర్తి రామకృష్ణ, ఆరుమిల్లి లాల్‌బాబు, యర్రంశెట్టి సాయిబాబు, శేరు శ్రీనుబాబు, కుంపట్ల నాయుడు, గుత్తుల రామకృష్ణ, బోరుసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంపులో నీరు లీకుకాకుండా శాశ్వత చర్యలు

పి.గన్నవరం, సెప్టెంబరు 3: లంకలగన్నవరంలో తాగునీరు సరఫరా కోసం ఏర్పాటుచేసిన సంపులో నీరు లీకు కాకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎం.సురేష్‌బాబు తెలిపారు. లంకలగన్నవరం పంచాయతీ చెంతనే ఏర్పాటుచేసిన 2లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్‌సంపు క్రింది భాగం నుంచి నీరు లీకవుతుందని, సంపు బలహీనపడిందని గ్రామస్తులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం పరిశీలనకు వచ్చిన ఈఈకి గ్రామస్తులు సంపు గురించి వివరించారు. తొలుత ఈఈ సంపు లోపలకు దిగి అడుగు భాగాన్ని లైట్ వెలుగులో పరిశీలించారు. జేఈ కళ్యాణచక్రవర్తి, ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

మలికిపురం, సెప్టెంబరు3: చింతలమోరిలోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముంపు నీరు రోడ్డుపై మూడు అడుగుల ఎత్తున ప్రవహిస్తుంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

విద్యార్థులకు విద్యోపకరణాల పంపిణీ

కె.గంగవరం, సెప్టెంబరు3: కూళ్ల ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు మంగళవారం కూటమి నాయకులు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజునేపథ్యంలో గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో మొక్కలు నాటించారు. నాయకులు యర్రంశెట్టి బాలబాలాజీ, ఉపాధ్యాయుడు చిట్టూరి రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అదనపు వసూళ్లపై ఆగ్రహం

మండపేట, సెప్టెంబరు3: మండపేటలోని చిన్నపిల్లల ఆసుపత్రికి మంగళవారం పట్టణానికి చెందిన ఎస్.ఎస్.నారాయణ ఆరేళ్ల కుమారుడిని తీసుకుని వెళ్లాడు. అపస్మారకస్థితిలో ఉన్న బిడ్డకు వైద్య పరీక్షలు చేయమని కోరాడు. ఆసుపత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్య వైఖరి అవలంబించారని బాధితుడు ఆరోపించాడు. ఓపీ టిక్కెట్ తీసుకున్నా ఇంజక్షన్ చేసేందుకు అదనంగా ఆసుపత్రి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించాడు. అత్యవసర సేవలు పరీక్షలు పేరిట అదనపు వసూళ్లు చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. 21వవార్డులో ఉన్న ఆసుపత్రికి పార్కింగ్‌కు చోటు లేకపోవటంతో ఆసుపత్రి ముందు ఉన్న మున్సిపల్ రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పంట పొలాల పరిశీలన

అంతర్వేది, సెప్టెంబరు 3: ఇటీవల కురిసిన అధిక వర్షాలకు రామేశ్వరం వరి పంట పొలాలను జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎ.రాజశేఖర్, జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి, శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ నందకిశోర్, ఏవో జె.మనోహర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం రైతులతో సమీక్షించారు. స్థానిక వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన పంట పొలాల పరిశీలనలో వరి పంట మూడు, నాలుగు రోజులు ముంపునకు గురైతే వీలైనంత త్వరగా నీరు తీసివేసి పంట త్వరగా కోలుకోవడానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్, ఎరువులు అదనంగా వేసుకుని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో వరద బాధితులకు కిట్లు



రావులపాలెం టీడీపీ కార్యాలయం వద్ద తుఫాన్ ప్రభావిత ప్రాంతానికి తరలిస్తున్న కిట్లు లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, సెప్టెంబరు 3: విజయవాడ వరద బాధితులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో కిట్లను పంపారు. కొత్తపేట నియోజకవర్గ టీడీపీ ఆధ్వర్యంలో 75వేల టూత్‌బ్రష్‌లు, 13వేల హ్యాండ్‌వాష్‌లను లారీలో మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయానికి పంపించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, జక్కంపూడి వెంకటస్వామి, కాసా సాగర్, చీకరమిల్లి లవరాజు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో వర్షం నీటిని తొలగించాలి

రాజోలు, సెప్టెంబరు 3: తాటిపాకలో అధిక వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు మంగళవారం పరిశీలించారు. వరి పొలాల్లో ఉన్న వర్షం నీటిని తీసిన తరువాత ఎకరానికి 20కిలోల యూరియా, 20కిలోల పొటాష్ వేయాలన్నారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ కోఆర్డినేటర్ నందకిశోర్, డీఆర్సీ పీడీ కిరణ్మయి, ఏడీఏ రాజశేఖర్, రామ్మోహనరావు, ఏవోలు మనోహర్, వై.మధుకుమార్, వీఏఏ అబ్బాస్, రైతులు దేవళ్ల మాణిక్యాలరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ముంపు తొలగింపునకు చర్యలు

మలికిపురం, సెప్టెంబరు 3: ముంపు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. చింతలమోరి-కేశవదాసుపాలెం మధ్యనున్న స్ట్రెయిట్ కట్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు చింతలమోరి, తూర్పుపాలెం, కేశవదాసుపాలెం తదితర ప్రాంతాలు జలమయమయ్యాయని, వాటిలోని ముంపు నీరు పోవడానికి రెవెన్యూ అధికారులు అన్ని చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. గుండుబోగుల పెదకాపు, చాగంటి స్వామి, ఉండపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

లక్కవరం పీహెచ్‌సీ అభివృద్ధి కోసం లేఖ

మలికిపురం, సెప్టెంబరు 3: లక్కవరంలోని ప్రభుత్వాసుపత్రిని ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు నివేదికలు సిద్ధం చేయాలని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏపీ యూఐఏఎంఎల్‌కు లేఖ రాసినట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. లక్కవరం పీహెచ్‌సీ ఆవరణలో ప్రైవేటు భాగస్వామ్యంతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయడానికి 2.56ఎకరాల భూమి ఉందన్నారు. మలికిపురం సండే మార్కెట్ అభివృద్ధికి నివేదికలు సిద్ధం చేయాలని ఆయన కోరారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 3: నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండుచేస్తూ సీపీఐ దేశవ్యాప్త ఆందోళన చేపట్టినట్టు జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు తెలిపారు. ఈదరపల్లి గ్రామ శాఖ కార్యాలయం వద్ద మంగళవారం గోడపత్రికలను ఆవిష్కరించారు. అధిక ధరలను తగ్గించాలని కోరుతూ ఈనెల6న కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతామన్నారు.

మండపేటలో జాబ్‌మేళా

మండపేట, సెప్టెంబరు 3: మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. మూడు సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. 73మంది అభ్యర్థులు హాజరుకాగా 24మంది ఉద్యోగాలకు ఎంపిక య్యారని ప్రిన్సిపాల్ కె.టి.టి.వి.శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి జాబ్‌మేళాలు నిర్వహిస్తుందని జిల్లా ఉపాధి శాఖాధికారి వసంతలక్ష్మి చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ ఆనందరావు, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి పి.లోకమాన్, ఏడీఎస్‌డీవో నాగబాబు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె.రాజేంద్రప్రసాద్, సంస్థల ప్రతినిధులు, మండపేట స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ వినోద్ పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, సెప్టెంబరు3: ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీన్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీవీటీసీ కులాలకు చెందిన వారు పీఎం జన్‌మన్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జీవీ సరోవర్ సూచించారు. గంగలకుర్రు అగ్రహారం, వక్కలంక గ్రామాల్లో సర్పంచ్‌లు దొంగ నాగేశ్వరరావు, వాసంశెట్టి రేవతి అధ్యక్షతన అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈవోపీఆర్డీ మమత, ఏపీవో అడపా కృష్ణ, ఎంఈవో కాండ్రేగుల వెంకటేశ్వరరావు, కార్యదర్శులు ఎన్.సత్యవేణి, తాతాజీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బలవంతపు వివాహంపై మహిళ ఫిర్యాదు

ముమ్మిడివరం, సెప్టెంబరు3: బలవంతపు వివాహంపై ఓ వివాహిత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాణేలంక చినపేటకు చెందిన వివాహిత అదే గ్రామంలోని పాఠశాలలో స్వీపరుగా పనిచేస్తుంది. భర్త కూడా అదే పాఠశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున తన ఉద్యోగ విధులకు సంబంధించి ఆ సమయంలో వాకింగ్‌కు వెళుతున్న ఆ గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు ఇసుకపట్ల ఈశ్వర్‌కుమార్‌తో మాట్లాడడాన్ని చూసిన అత్తింటివారు తనకు, అతనికి వివాహేతర సంబంధాన్ని అంటగట్టి, పెద్దలసమక్షంలో పంచాయతీ నిర్వహించి తనకు, ఈశ్వర్‌కుమార్‌కు అంబేడ్కర్ విగ్రహం వద్ద బలవంతంగా వివాహం జరిపించారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

50లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

మండపేట, సెప్టెంబరు3: ద్వారపూడిశివారు వేములపల్లి వద్ద మంగళవారం రాజానగరం మండలం తుంగపాడు నుంచి బైక్‌పై సారా తరలిస్తున్న వేములపల్లికి చెందిన చిటికెన శ్రీనును అరెస్టు చేసినట్టు మండపేట రూరల్ సీఐ దొరరాజు, ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. 50లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అతడికి కోర్టు రిమాండ్ విధించిందన్నారు.

అభివృద్ధి పనులు మొదలు పెట్టాం: ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, సెప్టెంబరు 3: కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులు మొదలు పెట్టిందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బడుగువానిలంకలో ఎంపీపీ నిధులు రూ.10లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, ఎంపీడీవో జాన్‌లింకన్, నాయకులు పాలూరి గోవిందరాజు, దూలం రాంబాబు, యేరుబండి ధర్మరాజు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.